సాక్షి
రంగారెడ్డి
శనివారం । 22 । జూలై । 2023



'అడ్డా' బతుకులు ఆగం!

వరుసగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకడం లేదు. 10లో▸



విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

తెగిపడిన విద్యుత్‌వైర్లు తగిలి నాలుగు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో జరిగింది. 10లో▸



అంతర్జాతీయ సదస్సు షురూ

సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంఐడబ్ల్యూఏఐ-2023 అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. 10లో▸

న్యూస్‌రీల్

నేడు కాన్హాకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

నందిగామ: కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శనివారం మండల పరిధిలోని కాన్హా శాంతి వనానికి రానున్నట్లు పీఆర్‌ఓ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించే ×వై 20 సమ్మిట్‌కు ఉదయం 9 గంటలకు హాజరు కానున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రితో పాటు గురూజీ కమ్లేష్ డి పటేల్, పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు చెప్పారు.

ప్రైవేటు పాఠశాలల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం కరస్పాండెంట్ల ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, హ్యాండ్ బుక్‌ను విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆవిష్కరించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నారాయణరెడ్డి, కార్యదర్శి భరత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం మంత్రి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులను మంత్రి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సమగ్ర సమాచారం, ప్రభుత్వ జీవోలు, వివిధ రకాల ఉత్తర్వులను అందులో పొందుపర్చినట్లు నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, రామచందర్, శ్రీకాంత్ రెడ్డి, రామచంద్రారెడ్డి, అనిల్ కుమార్, బుచ్చిరెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగు వివరాలు పక్కాగా నమోదు చేయాలి



చరికొండలో పత్తిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

కడ్తాల్: రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి సూచించారు. మండల పరిధిలోని చరికొండ గ్రామంలో శుక్రవారం వానాకాలం సీజన్ పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ విస్తరణ అధికారులు పకడ్బందీగా రైతుల పంటల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పంటల సాగు నమోదు ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోందని అన్నారు. అనంతరం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నూతనంగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన 18 నుంచి 59 ఏళ్లలోపు రైతులు తప్పని సరిగా రైతుబీమా పథకం కోసం వచ్చే నెల 5వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత, ఏఈవో అభినవ్‌రెడ్డి ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి




పార్టీ చేవెళ్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డికి సన్మానం

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్టీ చేవెళ్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డిని నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని, పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం నాయకుడు సున్నపు వసంతం, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఆగిరెడ్డి, కార్యదర్శులు మధుసూదన్‌గుప్తా, పెంటయ్యగౌడ్, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

జలకళ



నిండుకుండలా గండిపేట జలాశయం



హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తడంతో ప్రవహిస్తున్న వరద నీరు

జంట జలాశయాలకు భారీ వరద

- హిమాయత్‌సాగర్ రెండు గేట్లు ఎత్తిన అధికారులు
- నేడో, రేపో ఉస్మాన్‌సాగర్ గేట్లు తెరిచే అవకాశం
- పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు
- నీట మునిగిన పంటలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జంట జలాశయాలకు వరద పోటెత్తుతోంది. ఈసీ, మూసీ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా జలాశయాల్లో గంటగంటకూ నీటి మట్టం పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటిని ఎప్పటికప్పుడు దిగువకు వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం హిమాయత్‌సాగర్‌కు రెండు గేట్లు ఎత్తి వచ్చిన నీరు వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. ఉస్మాన్‌సాగర్ నిండుకుండను తలపిస్తోంది. ఒకటి రెండు రోజుల్లో జలాశయం గేట్లు తెరిచే అవకాశం ఉంది. నగరానికి ఎగువన ఉన్న ఈ రెండు జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో దిగువన మూసీకి ఇరువైపులా లోతట్టు ప్రాంతాల్లోని బస్తీవాసులను అప్రమత్తం చేశారు. తుర్కయంజాల్ మాసబ్ చెరువు, ఇబ్రహీంపట్నం చెరువు, రావిర్యాల పెద్ద చెరువు, నందిగామ శివారులోని నర్సప్పగూడ చెరువు సహా పలు చెరువులు, కుంటల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఆయా చెరువులు, కుంటలు మరోసారి మత్తడి దూకేందుకు సిద్ధంగా ఉన్నాయి.

రెండు గేట్లు.. ఫీటు మేర పైకెత్తి..

హిమాయత్‌సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,763.50 అడుగులు కాగా, ప్రస్తుతం 1,762.75 అడుగులుగా ఉంది. ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమ్యారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సాయంత్రం ఐదు గంటలకు హిమాయత్‌సాగర్‌కు చేరుకుని, 5, 10వ నంబర్ల గేట్లను ఒక ఫీటు మేర పైకి ఎత్తారు. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 1,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 700 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం, ఎగువ నుంచి వస్తున్న వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువన ఉన్న ఈసీవాగు కేబీదొడ్డి శివారులో పొంగి ప్రవహిస్తోంది. నీటి ప్రవాహానికి రియల్టర్లు అడ్డుకట్టలు వేయడంతో ఆ పక్కనే ఉన్న రైతుల పంట పొలాలు నీట మునిగాయి. చేతికొచ్చిన పూల తోటలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఎంటీరు వాగు ఉధృతికి కేబీదొడ్డి- సుల్తాన్‌పల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

నిండుకుండలా ఉస్మాన్‌సాగర్

వికారాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లిలో కురిసిన భారీ వర్షాలకు ఉస్మాన్‌సాగర్ జలాశయానికి ఎగువన ఉన్న మూసవాగుకు వరద పోటెత్తుతోంది. జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 1,790 ఫీట్లు కాగా, శుక్రవారం ఉదయానికి 1,785.05 ఫీట్లకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3.90 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.987 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం రాత్రి వర్షం కురిస్తే.. శనివారం సాయంత్రం వరకు గేట్లు తెరిచే అవకాశం ఉందని భావిస్తున్నారు.



మొయినాబాద్: వెంకటాపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ



మొయినాబాద్ రూరల్: అమ్డాపూర్ వద్ద నీట మునిగిన గులాబీ తోట



కొందుర్గు: అలుగు పారుతున్న గుర్రంపల్లి ఊరచెరువు

మహిళా రైతులకు ప్రోత్సాహం

డీఆర్డీఏ పీడీ ప్రభాకర్



రైతు సాగు చేసిన టమాటా పంటను పరిశీలిస్తున్న పీడీ ప్రభాకర్ తదితరులు

కేశంపేట: మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలని డీఆర్డీఏ పీడీ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం ఐకేపీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. గ్రామాల్లో రైతులు పండించిన ఆహార ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు రూ.8లక్షల విలువైన ట్రాలీ ఆటోను డీఆర్డీఏ ద్వారా మండల మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘానికి ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించడంతో పాటు రైతులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలను పరిశీలించారు. మండల పరిధిలోని అల్వాల గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులతో పాటు నర్సరీ, పల్లె ప్రకృతి వనంను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీడీ జంగారెడ్డి, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, డీపీఎం బాలరాజు, నాన్‌ఫార్మ్ డీపీఎం నరసింహ, ఏపీఎంలు భగవంతు, శిరీష, ఎంపీఓ నర్సింలు, ఇన్‌చార్జి ఏపీఓ అజీజ్, నీలకంఠంబాబు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

మోకిల ప్లాట్‌లకు అనూహ్య స్పందన

తొలిదశలో 50 ప్లాట్లకు వేలం

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలోని హెచ్‌ఎండీఏ ప్లాట్ల విక్రయానికి శుక్రవారం నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి అనూహ్యమైన స్పందన లభించింది. సుమారు 200 మందికి పైగా ఆసక్తి కలిగిన కొనుగోలుదారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తొలిదశలో 50 ప్లాట్లను విక్రయించేందుకు హెచ్‌ఎండీఏ నోటీఫికేషన్ విడుదల చేసింది. రియల్ భూమ్ భారీగా ఉన్న మోకిల ప్రాంతంలో హెచ్‌ఎండీఏ సుమారు 165.37 ఎకరాల విస్తీర్ణంలో 1,321 ప్లాట్లతో లేఅవుట్‌ను రూపొందించింది. వాటిలో తొలిదశగా 50 ప్లాట్లను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించనుంది. అందరికీ అందుబాటులో ఉండే విధంగా మోకిల ప్లాట్ల ధరలను గజం కనీస ధర రూ.25,000 చొప్పున నిర్ణయించారు. కొనుగోలుదారులు ఆన్‌లైన్ వేలం ప్రక్రియలో పాల్గొని గజానికి రూ.500 చొప్పున కోట్ చేసి ఏ-1 బిడ్డర్‌గా నిలిచి ప్లాట్లను సొంతం చేసుకోవచ్చు. 'వెస్ట్ సిటీ హబ్' గా పేరొందిన ఈ లే అవుట్‌లో ప్లాట్ కొనుగోలు కోసం స్థానికులతో పాటు స్థానికేతరుల నుంచి కూడా పెద్దఎత్తున పోటీ కనిపిస్తోంది. శుక్రవారం జరిగిన ప్రీబిడ్ సమావేశంలో ఎమ్మెఎస్‌టీసీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాంకేతిక అంశాలను వివరించారు. హెచ్‌ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్ బి.కిషన్ రావు మోకిల వెంచర్ ప్రాధాన్యతను, హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేయనున్న మౌలిక సదుపాయాలను వివరించారు. హెచ్‌ఎండీఏ సెక్రెటరీ పి.చంద్రయ్య మోకిల ప్రాంతానికి ఉన్న విశిష్టతను వెల్లడించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ పరంజ్యోతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు, ఎస్టేట్ మానిటరింగ్ యూనిట్ శ్రీకాంత్ రెడ్డి, కీర్తి చంద్ర (అకౌంట్స్)లతో పాటు బ్యాంకర్లు పాల్గొన్నారు.

రైలింజన్‌పైకెక్కి వృద్ధుడి హల్‌చల్



రైలింజన్‌పై హైటెన్షన్ తీగను పట్టుకునేయత్నం

తాండూరు టౌన్: తాండూరు రైల్వేస్టేషన్‌లో నిలిచిన ఓ రైలింజన్ పైకి ఓ వృద్ధుడు ఎక్కి హల్‌చల్ చేశాడు. హైటెన్షన్ తీగను పట్టుకునేందుకు యత్నించి గాయాలపాలయ్యాడు. ఈఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కల్లూరుకు చెందిన 60 ఏళ్ల కొండం చంద్రశేఖర్ మతి స్థిమితం కోల్పోవడంతో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోనే తిరుగుతుండేవాడు. సాయంత్రం హైదరాబాద్ నుంచి ముంబై వెళ్తున్న హుస్సేన్ సాగర్ ఎక్స్‌ప్రెస్ తాండూరు రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఆ సమయంలో చంద్రశేఖర్ రైలింజన్ పైకెక్కి హైటెన్షన్ తీగను పట్టుకునేందుకు యత్నించాడు. అక్కడున్న వారు ఎంత వారించినా వినలేదు. ఇంతలో రైలు కదలడంతో ఇంజన్‌పై పడిపోయాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. స్థానికులు అందరూ కలిసి వృద్ధుడిని కిందకు దింపి, చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీగకు చేయి తగిలి ఉంటే పెను ప్రమాదం జరిగేదని, రైలు కదలడంతో ఇంజన్‌పై పడటంతో ప్రాణాలు దక్కాయని జనాలు ఊపిరి పీల్చుకున్నారు.

గురుకులంలో కలవరం

- అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్
- ఒక్కసారిగా ఎగిసిపడ్డ మంటలు
- భయాందోళనతో పరుగులు తీసిన విద్యార్థినులు

మొయినాబాద్: అర్ధరాత్రి.. జోరువాన.. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో విద్యుత్ మీటర్‌లో మంటలు.. అది చూసి భయాందోళనకు గురైన విద్యార్థినులు హాహాకారాలు చేస్తూ వర్షంలోనే పరుగులు తీశారు. ఈ సంఘటన మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం వెనకాల ఉన్న శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాలివి.. గురుకుల పాఠశాల భవనంలో గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ మీటర్‌లో మంటలు చెలరేగాయి. ఒకవైపు వర్షం పడుతుండగా.. మరోవైపు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు ఎగిసి పడటంతో నిద్రలో ఉన్న బాలికలు ఉలిక్కిపడి లేచారు. ఎటువెళ్లాలో అర్థంకాక భయంతో బయటికి పరుగులు తీశారు. సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగా, ఎస్ఐ ప్రణయ్‌తేజ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గురుకులంలో ఉన్న మొత్తం 517 మంది విద్యార్థినులను బయటకు తీసుకొచ్చారు. మెయిన్ ఆఫ్ చేసి నీళ్లతో మంటలను ఆర్పారు. కొంతమంది బాలికలను పోలీస్‌స్టేషన్, మరికొంతమందిని సమీపంలో ఉన్న మల్లికార్జునస్వామి ఆలయంలోకి తరలించారు. లైన్‌మన్‌ను పిలిపించి మరమ్మతులు చేయించిన అనంతరం విద్యార్థినులను గురుకులం భవనంలోకి తిరిగి తీసుకొచ్చారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



గురుకులం వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వచ్చిన విద్యుత్ మీటర్

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

ఘటనా స్థలాన్ని శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే షార్ట్ సర్క్యూట్ జరిగిందని మండిపడ్డారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ నక్షత్రం, ఎంపీటీసీ మోర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల ఆందోళన

ప్రమాద విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలకు వచ్చారు. తమ పిల్లలను పంపించాలని ప్రిన్సిపాల్, ఆర్‌సీఓతో వాగ్వాదానికి దిగారు.

సమస్యలు లేకుండా చూస్తాం



మీటర్ కెపాసిటీ సరిపోక షార్ట్‌సర్క్యూట్ అయినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. భవనానికి సరిపడే కొత్త మీటర్ ఏర్పాటు చేయడానికి డీడీ కట్టాం. సమస్యలన్నీ పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– శారద, గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి

ఆ రెండింటిపై ఎంఐఎం గురి!

- రాజేంద్రనగర్, మహేశ్వరం బరిలోకి..
- బీజేపీ, కాంగ్రెస్‌లకు చెక్ పెట్టే యోచన
- మైనార్టీల ఓట్లు డైవర్ట్ కాకుండా యాక్షన్ ప్లాన్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇప్పటి వరకు పాతనగరానికే పరిమితమైన ఎంఐఎం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో శివారు జిల్లాల్లోనూ పాగా వేయాలని భావిస్తోంది. ఈ మేరకు మైనార్టీలు అధికంగా ఉన్న మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో తమ పార్టీ నుంచి అభ్యర్థిని బరిలోకి దించాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ముస్లిం మైనార్టీ ఓట్లు కాంగ్రెస్‌కు డైవర్ట్ కాకుండా చేయడం ద్వారా పరోక్షంగా బీఆర్‌ఎస్‌కు మేలు చేకూర్చొచ్చని భావిస్తోంది. ఆ రెండు పార్టీల అధినేతల మధ్య ఇప్పటికే అవగాహన కుదిరినట్లు సమాచారం. ఒకేదెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు ఇటు కాంగ్రెస్..అటు బీజేపీలకు చెక్ పెట్టొచ్చని యోచిస్తోంది. బీఆర్‌ఎస్ అధిష్టానం కూడా ఆ పార్టీ నుంచి ఇదే ఆశిస్తున్నట్లు తెలిసింది.

మహేశ్వరంలో..

నియోజకవర్గంలో జనవరి 2023 నాటికి 551 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీటి పరిధిలో 2,46,574 మంది పురుష ఓటర్లు, 2,30,846 మంది మహిళా ఓటర్లు, 61 మంది ట్రాన్స్‌జెండర్లు, 58 మంది ఎన్‌ఆర్‌ఐలు, 73 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. వీరిలో సుమారు 80 వేల మంది ముస్లిం మైనార్టీ ఓటర్లు ఉన్నట్లు అంచనా. వీరంతా పాతనగరానికి ఆనుకుని ఉన్న జల్‌పల్లి, శాహిన్‌నగర్, ఎర్రగుంట, వెంకటాపూర్, బాలాపూర్ పరిసరాల్లో స్థిరపడ్డారు. వీరిలో ఎంఐఎం సహా కాంగ్రెస్ అభిమానులు ఉన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి సబితారెడ్డితో పాటు కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థిని బరిలోకి దించే అవకాశం ఉంది. ఎంఐఎం ఇప్పటి వరకు ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతిస్తూ వచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నువ్వా.. నేనా.. అన్నట్లు పోటీపడుతున్నాయి. అధికార బీఆర్‌ఎస్ దాని మిత్రపక్షమైన ఎంఐఎంలకు ఉమ్మడి శత్రువులు బీజేపీ, కాంగ్రెస్‌లే. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను ఓడగొట్టాలంటే ఎంఐఎం కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా అధికార బీఆర్‌ఎస్‌కు మేలు చేకూర్చాలని భావిస్తోంది.

రాజేంద్రనగర్‌లో..

నియోజకవర్గంలో 2023 జూన్ చివరి నాటికి 535 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీటి పరిధిలో మొత్తం ఓటర్లు 5,10,221 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,66,982 మంది పురుషులు, 2,33,208 మంది మహిళలు, 31 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. కాటేదాన్, శంషాబాద్, గండిపేట, రాజేంద్రనగర్‌లలో లక్ష మందికిపైగా ముస్లిం మైనార్టీ ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ఏ అభ్యర్థి గెలవాలన్నా.. వీరే కీలకం. 2018 ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థిని నిలబెట్టగా 45 వేలకుగా ఓట్లు వచ్చాయి. ఈసారి కూడా అభ్యర్థిని నిలబెట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇక్కడ బీఆర్‌ఎస్, బీజేపీలు నువ్వా..నేనా అన్నట్లుగా ఉంది. ఉమ్మడి శత్రువైన బీజేపీకి చెక్ పెట్టాలన్నా.. మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందాలన్నా..ఎంఐఎం మళ్లీ తన అభ్యర్థిని నిలబెట్టాల్సిందే. అధికార బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సహా ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా ఈ స్థానాన్ని ఆశిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి పీసీసీ అధికార ప్రతినిధి జ్ఞానేశ్వర్ మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు.

నేటి పరీక్షలు వాయిదా

లాలాపేట: భారీ వర్షాల నేపథ్యంలో శనివారం ఓయూ పరిధిలో జరిగే అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఓయూ రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా 20, 21 తేదీల్లోని పరీక్షలనే వాయిదా వేయగా.. వర్షాలు తగ్గకపోవడంతో మరునటి పరీక్షనూ వాయిదా వేసినట్లు తెలిపారు.

ఉస్మానియా మెడికల్ కాలేజీలో వర్చువల్ రియాలిటీ ఫెసిలిటీ

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉస్మానియా మెడికల్ కాలేజీలో 'వర్చువల్ రియాలిటీ ఫెసిలిటీ'ని ఏర్పాటు చేశారు. అనాటమీ (శరీర నిర్మాణశాస్త్రం)లో అధునాతన సాంకేతికతతో కూడిన బోధనను పరిచయం చేయడానికి ఈ సౌకర్యం ఉపయోగపడుతుంది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాథమిక సబ్జెక్ట్ అయిన అనాటమీ బోధన కీలకం. ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి సమక్షంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ వర్చువల్ రియాలిటీ సదుపాయాన్ని ప్రారంభించారు. అనంతరం అనాటమీ విభాగాధిపతి డాక్టర్ జానకి పుప్పాల ప్రత్యేక సెషన్‌ను నిర్వహించారు.

అనుమానాస్పదంగా యువకుడికి గాయాలు

కేసు నమోదు చేసిన పోలీసులు



గాయపడిన హాజీ

నందిగామ: ఓ యువకుడు అనుమానాస్పదంగా గాయపడి అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్నాడు. ఈ ఘటన కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో గురువారం రాత్రి వెలుగుచూసింది. కొత్తూరు ఇన్‌స్పెక్టర్ శంకర్ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన హాజీ గురువారం రాత్రి 10.30గంటల ప్రాంతంలో తన ఇంటి సమీపంలోని మరో ఇంటి ఎదుట గయాలతో పడిపోయి ఉన్నాడు. గమనించిన స్థానికులు ఆయన కుటుంబ సభ్యులతో తెలపడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య తబస్సు బేగం గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేయడం లేదా ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హైనా దాడిలో ఆవుదూడ మృతి



ఆవుదూడ కళేబరం

కద్తాల్: హైనా దాడిలో ఆవు దూడ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని ఎక్వాయి పల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. రైతు పర్వతాలు గురువారం సాయంత్రం తన వ్యవసాయ పొలం వద్ద పాకలో పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం పాలు పితికేందుకు వెళ్లగా పశువుల పాక సమీపంలో తీవ్ర గాయాలతో ఆవుదూడ మృతి చెంది ఉంది. విషయాన్ని గ్రామస్తులకు తెల్పడంతో చిరుత పులి దాడి చేసిందనే అనుమానంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు వివరాలు సేకరించారు. అక్కడ లభించిన ఆనవాళ్ల ప్రకారం హైనా దాడిలో అవుదూడ మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందిస్తామని అధికారులు తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి గేదెలు మృత్యువాత



మృత్యువాత పడిన గేదెలు

తుర్కయంజాల్: తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి నాలుగు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఎం ఎం కుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. మన్నెగూడకు చెందిన మర్రి జగన్‌రెడ్డి రోజు మాదిరిగా ఎంఎం కుంటలో గేదేలను మేపడానికి వెళ్తున్నాడు. అప్పటికే తెగి పడి ఉన్న విద్యుత్ గేదెకు తగిలి చనిపోవడంతో దాని చుట్టూ మిగతా గేదెలు చేరాయి. విద్యుత్ తీగ మరో మూడు గేదేలకు తగలడంతో అవి అక్కడిక్కడే ప్రాణం విడిచాయి. విషయం తెలుసుకున్న అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని పలుమార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ ఏఈ స్పందించలేదని రైతులు ఆరోపించారు. గేదెల విలువ సుమారు రూ.4లక్షల ఉంటుందని.. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

‘అడ్డా’ బతుకులు ఆగం!

- పది రోజులు బోనాల సందడి.. ఆ తర్వాత వర్షం తాకిడి
- పక్షం రోజులకు పైగా దొరకని పనులు
- అర్ధాకలితో అలమటిస్తున్న కార్మికులు
- లేబర్ అడ్డాల వద్ద ఆశగా ఎదురుచూపులు



షాహిన్‌నగర్ అడ్డాపై పనికోసం ఎదురుచూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పహాడీషరీఫ్: సాధారణంగానే వర్షం అనగానే అందరికీ సంతోషం. చిన్నారులైతే వానలో కేరింతలు కొడుతూ సరదా.. సరదాగా గడుపుతారు. యువత, మరికొందరు.. స్నేహితులు, బంధువులతో చిన్నచిన్న పార్టీలు చేసుకునేందుకు ఎదురు చూస్తుంటారు. కానీ నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకడం లేదు. దీంతో పూట గడవక పస్తు లుండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పది రోజులుగా ఎక్కడ చూసినా బోనాల పండుగ హడావుడి, ఆ వెంటనే వర్షాలు మొదలవడంతో సుమారు పదిహేను రోజులుగా ఖాళీగానే ఉంటున్నారు. అడ్డాల వద్దకు వెళ్లి గంటల తరబడి ఎదురు చూసినా పని దొరకకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని షాహిన్‌నగర్ లేబర్ అడ్డాపై కార్మికులు దీనంగా కనిపిస్తున్నారు.

పొట్ట చేతపట్టుకొని వచ్చి..

గ్రామాల నుంచి ఎంతో మంది కూలీలు వలస వచ్చి నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి నిత్యం రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. ఉదయాన్నే లేచింది మొదలు అడ్డాపై పడిగాపులు కాస్తే.. చివరకు కూలీ దొరుకుతుందో..? లేదో కూడా తెలియదు. సాధారణ రోజుల్లోనే నెలకు 15– 20 రోజుల పని దొరకడం గగనం. వీరిలో కొంతమంది గుత్తేదార్ల కింద్ద పనిచేస్తూ శ్రమదోపిడీకి గురవుతున్నారు. దీనికి తోడు ఇలాంటి వర్షాకాలంలో వీరి జీవన పరిస్థితులు మరింత దుర్భరంగా మారుతున్నాయి.

బీమా, రక్షణపై నిర్లక్ష్యం

అడ్డాలపై రోజువారీ కూలీ పనులు చేసే భవన నిర్మాణ రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే బీమా సదుపాయాలు, ఇతర రక్షణ చర్యలకు సంబంధించి ఏ మాత్రం అవగాహన ఉండడం లేదు. ఈ విషయాన్ని కార్మిక శాఖ సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ–శ్రామ్ వంటి పథకం చాలా మంది కార్మికులకు తెలియదు. కార్మిక చట్టాలలో పేర్లను నమోదు చేసుకుంటేనే వీరికి కనీస భద్రత, ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

తొమ్మిది రోజులుగా పనిలేదు



పనికోసం నిత్యం షాహిన్ నగర్ అడ్డాపైకి వస్తున్నా. తొమ్మిది రోజులుగా దొరకడం లేదు.ఈ రోజు ఉదయం పూట వర్షం కాస్త తగ్గు ముఖం పట్టడంతో పని దొరుకుతుందనుకున్నా.. కానీ చివరికి నిరాశే ఎదురైంది.ఇంట్లో చిన్న పిల్లలున్నారు.కుటుంబం గడవడం ఇబ్బందిగా మారింది.మాలాంటి దినసరి కూలీలకు పని భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది.

– మహ్మద్ మజీద్, భవన నిర్మాణ కార్మికుడు

బియ్యం లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా

మొయినాబాద్: బియ్యం లోడుతో వెళ్తున్న ఓ వాహనం బోల్తా పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని జేబీఐటీ సమీపంలోని అమ్డాపూర్ రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ముర్తూజగూడ సమీపంలో ఉన్న గోదాం నుంచి నగరంలోని బేగం బజార్‌కు బొలెరో వాహనంలో బియ్యం బస్తాలు తరలిస్తున్నారు. జేబీఐటీ సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డు కిందికి దిగింది. అంతలోనే ఎక్సల్ రాడ్డు విరిగిపోయి వెనక చక్రం ఊడిపోయింది. దీంతో వాహనం బోల్తాపడింది.

ఆర్టీసీ బస్సు ఢీ..

ప్రయాణికుడికి తీవ్రగాయాలు



గాయపడిన ప్రయాణికుడు కృష్ణయ్య

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం.. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన ఉడతల కృష్ణయ్య ఊరుకొండపేట గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లోకి వస్తున్న సమయంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కిందపడ్డాడు. అదే వేగంతో బస్సు ఆయన రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హుటాహుటిన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని ఎన్నం హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి కుమారుడు జంగయ్యగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆమనగల్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

యువకుడి బలవన్మరణం

తలకొండపల్లి: ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాంపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ యాదవ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చందు(18) గురువారం సాయంత్రం పాలు పితికేందుకు పొలం వద్దకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పక్క పొలం వారికి ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆయన వెళ్లి చూడగా పొలం వద్ద కొట్టంలో దూలానికి ఉరేసుకుని కనిపించాడు. ఆయన వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీశైలం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యదూరం కావడంతో..

హయత్‌నగర్: భార్య దూరం కావడంతో మద్యానికి బానిసైన భర్త.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం హయత్‌నగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరుకు చెందిన సయ్యద్ రియాజ్(37) రిజ్వానా దంపతులకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. గొడవల కారణంగా రిజ్వానా పది నెలలుగా వేరుగా ఉంటోంది. దీంతో రియాజ్ మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. శుక్రవారం రియాజ్ ఇంటికి తల్లి వచ్చి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి గౌసియా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి అవర్లీ బేసిస్‌లో మొత్తం నియమించనున్నట్లు తెలిపారు. ఇందులో ఆంగ్లం, తెలుగు, వృక్షశాస్త్రం, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, వాణిజ్యం లెక్చరర్ల పోస్టులు ఒక్కొక్కటి ఉన్నాయన్నారు. పీజీలో కనీసం యాభైఐదు శాతం మార్కులు కలిగి ఉండి, పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్ఈటీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన ఔత్సాహికులు ఈ నెల 23 సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

నందిగామ: తల్లితో గొడవ పెట్టుకొని ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి అదృశ్యమైన ఘటన కొత్తూరు మున్సి పాలిటీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కొత్తూరుకు చెందిన మంగలి సురేందర్(29) 12 ఏళ్లు గా ఓ టెంట్ హౌస్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంటికి వచ్చిన ఆయన తల్లి పద్మమ్మతో గొడవ పడ్డా డు. అనంతరం తాను ఇంట్లో ఉండనని చెప్పి వెళ్లిపోయాడు. గురువారం ఫోన్ చేస్తే పనిఉందని.. రెండు రోజుల తర్వాత వస్తానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. శుక్రవారం ఫోన్ చేయగా రింగ్ అవుతున్నాకూడ ఫోన్ తీయడం లేదు. దీంతో ఆందోళనకు గురైన పద్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

భార్యతో గొడవపడిన భర్త..



జగదీష్ (ఫైల్)

శంషాబాద్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గగన్ పహాడ్‌లో నివాస ముండే జోగు జగదీష్(31) జూన్ 10వ తేదీన డ్యూటీకి వెళుతున్నాని చెప్పి బైక్‌పై వెళ్లాడు. అంతకుముందు ఇంట్లో భార్యతో చిన్నపాటి గొడవపడ్డాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో పలుచోట్లు వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భార్య రేవతి ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సు షురూ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

ఇబ్రహీంపట్నం రూరల్: సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంఐడబ్ల్యూఏఐ–2023 అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు వివిధ దేశాల నుంచి 150 మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యఅతిథులుగా థామస్ జెఫారీసన్, విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ డీకే మల్హోత్రా హాజరై మల్టీ డిసిప్లీనరీ సదస్సులు ఏ విధంగా విజ్ఞాన సముపార్జనకు, నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడతాయో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్‌సీ శివారెడ్డి, చైర్మన్ రాఘవ, డాక్టర్ వాణి వత్సల, డాక్టర్ రాఘవ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.